నేడు స్థానిక సంస్థల రిజర్వేషన్లపై

# ప్రజాభిప్రాయ సేకరణ



వికారాబాద్, నవంబర్ 12 : స్థానిక సంస్థల రిజర్వేషన్లపై రంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, సైదులు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారని.. జిల్లాలో ఉన్న బీసీ, ఇతర కుల సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు వెళ్లి తమ సూచనలు, అభిప్రాయాలను తెలపాలన్నారు. అవసరమైన సమాచారాన్ని అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్‌ను అభివృద్ధిలో

# ముందుంచుదాం

**దిశ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

వికారాబాద్, నవంబర్ 12 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకుని జిల్లా అభ్యున్నతికి కృషి చేద్దామని దిశ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనికి దిశ వైస్ చైర్‌పర్సన్ ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు పరిష్కరించాల న్నా రు. దిశ ప్రాధాన్యాన్ని గుర్తించి సమావేశంలో ప్రతిపాదించిన, చర్చించిన పరిష్కార విషయాలను మూడు నెలల్లో సమీక్షించుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు స్వచ్ఛభారత్ కింద బాత్‌రూమ్‌లకు ప్రాధాన్యామివ్వాలన్నారు. పర్యా టక రంగాభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరయ్యాయని.. వాటితో మున్సిపల్ పరిధిలో పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్, పరిగి మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, నామినేటెడ్ సభ్యులు నందు, రాజశేఖర్, జానకీరామ్, లలిత, మున్సిపల్ కమిషనర్లు జాకీర్‌అహ్మద్, వెంకటయ్య, విక్రమ్‌సింహారెడ్డి, పాల్గొన్నారు.

# సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

**రంగారెడ్డి డీపీవో సురేశ్‌మోహన్**

ఇబ్రహీంపట్నం రూరల్, నవంబర్ 12 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీరాజ్ అధికారి సురేశ్‌మోహన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎలాంటి తప్పుల్లేకుండా సర్వేను చేపట్టాలన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని పల్లెప్రకృతివనం, కంపోస్ట్‌యార్డును పరిశీలించారు.



ఉప్పరిగూడలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

**ఎన్యూమరేటర్లపై ఒత్తిడి తగ్గించాలి**

ధారూరు, నవంబర్ 12 : ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పీఆర్టీయూ మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, మాణిక్యం పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం వరి కోత పనులు జోరుగా సాగుతుండడంతో రైతులు, కూలీలు ఇండ్లకు తాళాలు వేసి పొలాలకు వెళ్తున్నారని.. ఎన్యూమరేటర్లు మధ్యాహ్నం సమయంలో ఇండ్ల వద్దకు వెళ్లినప్పుడు వారికి తాళాలే దర్శమిస్తున్నాయని..వారు మళ్లీ, మళ్లీ ఆ ఇండ్ల వెళ్లాల్సి వస్తున్నదన్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు సర్వే పూర్తి కావడం కష్టమేనని వారు పేర్కొన్నారు. ఉపాధ్యా యులకు పనిభారం ఎక్కువై మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అందువల్ల ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 కుటుంబాలను కేటాయించి, అదనంగా ఎన్యూమరేటర్లను నియమించాలని, సర్వే గడువును ఈ నెల చివరి వరకు పొడిగించాలన్నారు.



మెథడిస్టు జాతరలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ డాక్టర్ డానియేలు

# ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ప్రారంభం

ధారూరు, నవంబర్ 12 : మండలంలోని ధారూరు స్టేషన్ మెథడిస్టు జాతరను మంగళవారం బిషప్ డాక్టర్ డానియేలు, డాక్టర్ ఆశాడా నియేలు ప్రారంభించారు. అనంతరం జాతర ముఖద్వారం నుంచి పాదయాత్రతో బిషప్‌లు, పాస్టర్లు కలిసి ఏసుక్రీస్తు శిలువ వద్దకు వచ్చి ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసంగించారు. 102వ ధారూరు మెథడిస్టు జాతర మంగళవారం నుంచి ఆదివారం వరకు కొనసాగనున్నది. దీనికి భక్తులు, యాత్రికులు భారీ సంఖ్యలో తరలివస్తారు. పోలీసులు జాతర ప్రాంగణంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు. చర్చి నిర్వాహకులు వసతులు కల్పించారు.

గ్రూప్-3 పరీక్షలకు **రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

# ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఆదిబట్ల, నవంబర్ 12 : ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో పోలీస్, నోడల్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. ఈ నెల 17న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10:00నుంచి 12:30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3:00 నుంచి సాయంత్రం 5:30 వరకు రెండో పేపర్, 18న ఉదయం మూడో పేపర్ ఉంటుందన్నారు. పరీక్షలకు ఉదయం 8:30 నుంచి 9:30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని అభ్యర్థులు దీనిని గమనించాలని సూచించారు. ఈ పరీక్షకు జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్ నోడల్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కరుణాకర్‌రావు, నోడల్ అధికారులు రామారావు, జడ్పీసీఈవో కృష్ణారెడ్డి, శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

# పేరుకుపోతున్న వడ్ల రాశులు

- కొనుగోలు చేయని అధికారులు
- అవస్థల్లో అన్నదాతలు



కొనుగోలు కేంద్రం రైతులు ఆరబెట్టిన ధాన్యం

మంచాల, నవంబర్ 12 : కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల రాశులు పేరుకుపోయి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని బోడకొండ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారం రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. దీంతో అన్నదాతలు అక్కడికి ధాన్యాన్ని తీసుకొచ్చి ఎండబెట్టినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద కనీస వసతులు కల్పించలేదని.. నీడ కోసం టెంట్ను కూ డా ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి రోజూ ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎలాంటి అవస్థలు లేవని.. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేవారని రైతులు పేర్కొంటున్నారు. రైతుల బాధలు తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ హరిప్రసాద్, నాయకులు సతీశ్, యాదయ్య, బాల్‌రాజ్ గౌడ్ కొనుగోలు కేంద్రం వద్దకెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే వడ్లను కొనాలని డిమాండ్ చేశారు.

# గిఫ్టు డీడ్ చేసి..సొంతానికి వాడుకుంటూ..

- ప్రభుత్వానికి అప్పగించని 668.31 గజాల స్థలం
- ప్రస్తుతం దాని విలువ రూ. నాలుగు కోట్లు..
- కన్వెన్షన్ హాల్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



డాక్యుమెంట్ పత్రం

ప్రభుత్వానికి గిఫ్టు డీడ్ చేసిన స్థలం ఇదే..

ఆదిబట్ల, నవంబర్ 12: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఓ వ్యక్తి హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొంది ఐదు ఎకరాల స్థలంలో విశాలమైన రెండు కన్వెన్షన్ హాళ్లను నిర్మించాడు. అయితే అతడు ప్రభుత్వ నిబంధనల మేరకు మెట్రోపాలిటన్ కమిషనర్ హైదరాబాద్ పేరున డిసెంబర్ 24, 2021న డాక్యుమెంట్ నంబర్ 20644-2021పై సర్వేనంబర్ 388, 389, 390లోని 668.31 గజాల స్థలాన్ని గిఫ్ట్ డీడ్ చేశాడు. ఆ డాక్యుమెంట్లను మున్సిపల్ అధికారులకు ఇచ్చాడు. కానీ ఇంతవరకు ఆ స్థలాన్ని వారికి అప్పగించలేదు. గత కొన్ని రోజులుగా అతడు ఆ స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి పెద్ద, పెద్ద మొక్కలను నాటి తన అవసరాలకు వినియోగించుకుంటున్నాడు. ప్రస్తుతం ఆ స్థలం విలువ మార్కెట్లో దా దాపు రూ.4 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.

ప్రభుత్వానికి గిఫ్టు డీడ్ చేసిన స్థలాన్ని కన్వెన్షన్ హాల్ నిర్వాహకుడు సొంతానికి వాడుకుంటున్నట్లు ఈ నెల 6వ తేదీన కొంగరకలాన్ గ్రామస్తులు ఆన్‌లైన్ ద్వారా హెచ్‌ఎండీఏ, రాచకొండ కమిషనర్లు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, ఆదిబట్ల పోలీస్‌లకు ఫిర్యా దు చేశారు. వెంటనే ఆ స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులు స్వాధీ నం చేసుకోవాలని కోరుతున్నారు.

**నోటీసులు అందించాం..**

668.31 గజాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని ఇప్పటికే కన్వెన్షన్ హాల్ యజమానికి నోటీసులు జారీ చేశాం. అతడు నోటీసులకు స్పందించి స్థలాన్ని అప్పగించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు.

-బాలకృష్ణ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్

# బడ్జెట్‌పై కసరత్తేదీ?

**జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్ అంచనాపై పతిపాదనలు సమర్పించని శాఖలు**

**జనవరి రెండో వారంలోపు ఆమోదం పొందడం కష్టమే**

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో పాలన గాడి తప్పిందని అనడానికి ఇదో మచ్చుతునక మాత్రమే. ఆర్థిక సంక్షోభం పేరుతో కొత్త ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించని యంత్రాంగం... పాలన వ్యవహారాల్లోనూ అదే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నది. గడిచిన 11 నెలల వ్యవధిలో ముగ్గురు కమిషనర్లు మారడం, సాధారణ బదిలీలతో అదనపు కమిషనర్లు కొత్తగా రావడం, పాలనను సమర్థవంతంగా నడిపించే నాయకత్వం కొరవడటం వెరసి.. ప్రజాసమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రధానంగా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సైతం పరిష్కరించలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటి దాకా మొత్తం ప్రజావాణిలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్నింటికి పరిష్కారం చూపారు? అన్న నివేదికను వెల్లడించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రతి ఏటా రూపొందించే వార్షిక బడ్జెట్‌పై పట్టింపులేని ధోరణి అవలంబిస్తున్నది. గత అక్టోబర్‌లోనే 2025-26 బడ్జెట్ రూపకల్పనపై దృష్టి సారించాల్సిన ఫైనాన్స్ విభాగం నవంబర్ వచ్చినా గ్రేటర్ బడ్జెట్ పై అంచనాల కసరత్తును ప్రారంభించకపోగా మల్లగుల్లాలు పడుతున్నది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, కమిషనర్ ఇలంబరితి ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉండటం, ఈ నెల 23తర్వాతే తిరిగి హైదరాబాద్‌కు వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇంజినీరింగ్, అడ్వర్‌టైజ్ విభాగం, రవాణా, యూబీడీ, హెల్త్ వంటి విభాగాల నుంచి ప్రతిపాదనలు జీహెచ్‌ఎంసీ ఫైనాన్స్ విభాగానికి చేరలేదని తెలుస్తోంది. నిర్ణీత వ్యవధిలో బడ్జెట్ రూపకల్పన, ఆమోదం ఈ క్రమంలోనే వచ్చే ఏడాది జనవరి 10లోపు బడ్జెట్ ఆమోదం పొందడం కష్టసాధ్యమేనని అధికారులు భావిస్తున్నారు.

**ప్రారంభం కాని బడ్జెట్ ప్రతిపాదనలు..**

వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్ అంచనాలు రూపకల్పనపై కసరత్తును ప్రారంభించాలి. జీహెచ్‌ఎంసీ చట్టం -1955 ప్రకారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను ఈ నెలలో ఏ తేదీ తర్వాత బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10 లోపు జనరల్‌బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా కనబడుతున్నాయి. కొన్ని శాఖల ఆర్థిక విభాగానికి ప్రతిపాదనలు సమర్పించలేదు. బడ్జెట్ ప్రతిపాదనకు తొలుత స్టాండింగ్ కమిటీలో అనుమతి పొందాలి. కమిషనర్ వచ్చిన తర్వాతే స్టాండింగ్ కమిటీ సమావేశం ఉంటుంది. బడ్జెట్‌పై మార్పులు, చేర్పులు, అనంతరం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి కనీసం 20 రోజుల సమయం తీసుకోనుంది. ఆ తర్వాత జనరల్ బాడి సమావేశం తేదీని ప్రకటించడం, కనీసం 15 రోజుల ముందు కార్పొరేటర్ సభ్యులకు బడ్జెట్ ప్రతిపాదనలను అందజేయాల్సి ఉంటుంది. జనరల్ బాడి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం, సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మళ్లీ అవసరమైన మార్పులు, చేర్పుల అనంతరం బడ్జెట్ అనుమతికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. దీంతో వచ్చే జనవరి రెండో వారం లోపు బడ్జెట్ ఖరారు అయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. హౌసింగ్, జీహెచ్‌ఎంసీ బడ్జెట్ కలిపితే కొన్నేండ్లుగా పెరుగుతూ వస్తున్నది. 2021-22లో బడ్జెట్ అంచనాలు రూ.5600 కోట్లు, 2022-23లో బడ్జెట్ అంచనాలు రూ. 6,150 కోట్లు, 2023-24లో బడ్జెట్ అంచనాలు రూ. 6,224 కోట్లు, 2024-25లో రూ. 7,937 కోట్లు అంచనాతో బడ్జెట్ రూపొందించింది. అయితే 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాలు దాదాపు రూ. 8500 కోట్ల వరకు ఉండే అవకాశాలు కనబడుతున్నాయని చర్చ జరుగుతున్నది.




# ఉచిత గడ్డి విత్తనాల కోసం.. ఐదేండ్ల ప్రాజెక్టు

**పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్**

సుల్తాన్ బజార్, నవంబర్ 12: రాష్ట్రంలో పాడి రైతులు కోరుకుంటున్న ఉచిత గడ్డి విత్తనాల కోసం వచ్చే ఐదేండ్ల ప్రాజెక్టును రూపొందించాలని అధికారులను తెలంగాణ పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. మాసబ్ ట్యాంక్‌లోని పశు సంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని జిల్లా పశు వైద్యాధికారులతో ఎన్‌ఎల్‌ఎం పథకం రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా పశు వైద్యాధికారులతో చర్చించి పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్‌ఎల్‌ఎం-ఈడీపీలో పశు సంవర్ధక శాఖ సూత్ర ప్రాయంగా అంగీకరించిన ప్రాజెక్టుల కోసం బ్యాంకులు 67 సన్న జీవాలు (గొర్రెలు, మేకలు), 3 కోళ్ళ (పౌల్ట్రీ) ప్రాజెక్టులకు రుణం ఇచ్చేందుకు గాను ముందుకు వచ్చాయన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలను సేకరించి అన్ని సవ్యంగా ఉన్న ప్రాజెక్టులను కేంద్ర స్థాయిలో మంజూరుకు సిఫారసు చేశారని అన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ సిఫారసుపై కేంద్ర స్థాయి కమిటీ పరిశీలించిన అనంతరమే ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంటుందని అన్నారు. ప్రారంభించిన ప్రాజెక్టులకే సబ్సిడీ లభిస్తుందని లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించి, పశు పోషకుల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ఉచిత గడ్డి విత్తనాల కోసం వచ్చే ఐదేండ్ల ప్రాజెక్టును రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తెలంగాణ పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి, తెలంగాణ పశు గణాభివృద్ధి ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ మల్లేశ్వరి, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య ఎండీ డాక్టర్ బి.సుబ్బరాయుడుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైళ్లను భద్రంగా నడపండి

**అధికారులను ఆదేశించిన ఎస్‌సీఆర్ జీఎం**

**భద్రత అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించిన జీఎం**

హైదరాబాద్, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో శీతాకాలం నేపథ్యంలో పొగ మంచు భద్రతా పరికరాలతో రైళ్లను నడపాలని సంబంధిత అధికారులను రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఆదేశించారు. ఆ మేరకు మంగళవారం రైల్వే ఉన్నతాధికారులతో పాటు ఆరు డివిజనల్ రైల్వే మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జోన్ పరిధిలో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాల నిల్వల స్థితిగతులపై చర్చించి, అందుకు సంబంధించిన పరికరాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రైల్వే సైడింగ్ వద్ద లోడింగ్, అన్ లోడింగ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీ, ఆర్‌వోబీలను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు.

# సుస్థిర వ్యవసాయానికి స్టార్టప్‌లు దోహదం

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 12: దేశంలో సుస్థిర వ్యవసాయానికి స్టార్టప్‌లు అవసరమని నార్మ్ డైరెక్టర్ డా. సి.శ్రీనివాసరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఐసీఆర్-నార్మ్ ఆడిటోరియంలో ఏర్పా టు చేసిన 'దేశంలో స్థిరమైన వ్యవసాయ స్టార్టప్‌ల నిర్మాణం' అనే జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆహార భద్రత, సుస్థిరథ ఆవిష్కరణల ద్వారా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన ఆహార వ్యవస్థ అభివృద్ధి చెందనున్న నాణ్యమైన ఉత్పత్తికి మారడంతో హెక్టారుకు ఉత్పత్తి నుంచి అధిక ఉత్పాదకతకు మారడం అవరమన్నారు. నూజివీడు సీడ్స్ లిమిటెడ్ చైర్మన్ డా. ఎం.ప్రభాకర్ రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అద్భుతమైన అవకాశాలున్నాయన్నారు. స్టార్టప్‌లు విన్నూతమైన, అవసరాల, ఆధారిత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం, డా. ఎస్ సెంథిల్ వినాయగం మాట్లాడారు. నార్మ్ టెక్నాలజీ, బిజినెస్, ఇంకుబేటర్, ఎ- ఐడియా తో కలిసి నార్మ్ రెండు రోజుల సదస్సు నిర్వహిస్తోందన్నారు. అయితే, 13 రాష్ట్రాల నుం చి 47 స్టార్టప్‌లు, 13 ఎఫ్‌పీఓలు, 6 ఐకార్ ఇనిస్టిట్యూట్‌ల ఏబీఐలు, 3 బ్యాంకులు, పరిశ్రమలు, ఐఐటీ, ఆర్యుటీఏజీ, మద్రాస్, జీఓఎల్ తమ ఉత్పత్తులను, సాంకేతికతలను స్టా ల్స్‌లో ప్రదర్శించారు. రెండు ప్రచురణలు, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాలను సాధించడంలో అగ్రి సెక్టార్ సహకారం, విధాన పత్రం విడుదల చేశారు విజయ్ అవినాలింగం, ప్రిన్సిపల్ సైంటిస్టు, ఐకార్, నార్మ్, సీఈఓ నాబార్డ్, డైమెండ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్లాటినం స్పాన్సర్, ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ కళాశాల, అనురాగ్, మల్లారెడ్డి, హార్టికల్చర్ కళాశాల, ఆయా యూనివర్సిటీల శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గేమింగ్ ఫెయిర్

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): నగరంలో నేటి నుంచి ఈ నెల 15 వరకు గేమింగ్ ఫెయిర్ కొలువుదీరనున్నది. అందులో భాగంగా ఇండియా గేమ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ బుధవారం హెచ్ఐసీసీలో జరుగనున్నది. గేమింగ్ ఫెయిర్‌కు సంబంధించిన వివరాలు నిర్వాహకులు వెల్లడించనున్నా రు. కాగా, ఈ గేమింగ్ ఫెయిర్‌కు జాతీ య, అంతర్జాతీయ గేమింగ్ నిపుణులు హాజరవుతారు. గేమింగ్ కంపెనీ ఫౌండర్లు హాజరై, తమ సూచనలు ఇవ్వనున్నారు. 150 సెషన్స్ జరగనున్నాయి. కార్యక్రమంలో ఇన్వెస్టర్లు, గేమ్ డెవలపర్స్, పాలసీ మేకర్స్, గేమింగ్ ఔత్సాహికులు ఒకే వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

## అంతర్జాతీయ ఈవెంట్ల వేదికగా ఎస్కీ

72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భారీ కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నిర్మించిన ఈ భారీ కన్వెన్షన్ సెంటర్ నగరంలో జరిగే జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు వేదికగా మారనుందని డైరెక్టర్ రామేశ్వర్‌రావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 800 సీట్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ కన్వెన్షన్ సెంటర్‌లో ఆడిటోరియం, విశాలమైన డైనింగ్‌హాల్, లెక్చర్‌హాళ్లు, స్కై వ్యూ ఆడిటోరియం వంటి సదుపాయాలుండగా, ఇప్పటికే అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్, 11వ జాతీయ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వంటి సమావేశాలు జరిగినట్లుగా ఆయన పేర్కొన్నారు. కాలేజీ ప్రాంగణంలో, ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండే ఈ కన్వెన్షన్ సెంటర్ భవిష్యత్తులో అత్యంత రద్దీ అయిన ఈవెంట్ కేంద్రంగా మారనుందన్నారు.

- ప్రభుత్వాన్ని నిలదీస్తాం



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అంగీకారంతో భూములు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీకి 300 ఫీట్ల రోడ్డు అవసరమా అని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ రోడ్డుతో భూములు కోల్పోతున్న రైతులు మండల పరిధిలోని అగర్‌మియగూడ గ్రామంలో మంగళ వారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎకరా రూ.4 కోట్లు ధర పలుకుతుంటే.. రూ.19లక్షలు నష్టపరిహారం ఇస్తామనడం న్యాయమా..? అని ప్రశ్నించారు. చట్టంలో మార్పులు తీసుకొచ్చి రైతులకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. సొంత నియోజకవర్గంలో రైతులకు న్యాయం చేయలేని ముఖ్యమంత్రి రాష్ట్ర రైతులకు ఏం న్యాయం చేస్తాడన్నారు. రైతుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు.